సందేశం టైమ్స్
జాతీయ తెలుగు దిన పత్రిక
సందేశం టైమ్స్ జాతీయ తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ మరియు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుండి జిల్లాల నియోజకవర్గాల ఇన్చార్జిలు మరియు మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను ఆసక్తి గలవారు సంప్రదించండి.
శెట్టి వెంకటేష్ గౌడ్ సీఈవో
సెల్ నెంబర్ : 9052045 435,9542522611.

జాతీయ తెలుగు దినపత్రిక
RNI - TGTEL/25/A0348

# సందేశ టైమ్స్

నిజం దాగదు – వార్త ఆగదు

Download Sandesham Times
Short News App!
Speed in News.. Truth in Analysis!
Scan to Download
Download
Download Now
Get it on on Google Play

| మంగళవారం 14 ఏప్రిల్ 2026 | పేజీలు : 04 | వెల - రూ 2/- | సంపుటి : 01 సంచిక : 316 | ప్రచురణ : తెలంగాణ & ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : శెట్టి వెంకటేష్ |
|---|---|---|---|---|---|

## సీఎం రేవంత్ రెడ్డి కీలక వ్యాఖ్యలు – శ్రీపాదరావుకు నివాళులు, నియోజకవర్గాలపై హైబ్రీడ్ మోడల్ డిమాండ్, గిరిజన అభివృద్ధికి హామీ

**తెలంగాణ** శ్రీపాదరావు వర్ధంతి – సీఎం రేవంత్ రెడ్డి నివాళులు : సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రతినిధి: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ మాజీ స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు గారి 27వ వర్ధంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి జూబ్లీహిల్స్ నివాసంలో వారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. తెలుగు రాష్ట్రాల్లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సాధించిన నాయకుడని గుర్తుచేస్తూ, సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభ స్పీకర్ వరకు అనేక పదవులకు వన్నె తెచ్చిన మహానుభావుడని కొనియాడారు. శాసనసభ ఔన్నత్యాన్ని పెంచుతూ సభను హుందాగా నడిపిన తీరు ప్రశంసనీయమని పేర్కొంటూ, ఆయన జీవితం నేటి తరానికి గొప్ప స్ఫూర్తి అని సీఎం అన్నారు. కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఎంపీ వేం నరేందర్ రెడ్డి, ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ పాల్గొన్నారు.





నియోజకవర్గాల పెంపు జీఎస్‌డీపీ ఆధారిత హైబ్రీడ్ మోడల్‌లో జరగాలి: సీఎం : సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రతినిధి: దేశంలో లోక్‌సభ, అసెంబ్లీ నియోజకవర్గాల పెంపు మరియు పునర్విభజన ప్రక్రియ జీఎస్‌డీపీ ఆధారిత హైబ్రీడ్ మోడల్‌లో జరగాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి డిమాండ్ చేశారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్లకు సంపూర్ణ మద్దతు ఉన్నప్పటికీ, సీట్ల పెంపును జనాభా ప్రాతిపదికగా లేదా ఏకపక్షంగా 50 శాతం పెంచడం దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేస్తుందని హెచ్చరించారు. ప్రస్తుత 543 లోక్‌సభ స్థానాల్లో పెంపు చేసే 272 సీట్లలో 136 సీట్లను ప్రొరేటా ప్రకారం, మిగిలిన 136 సీట్లను జాతీయ స్థూల ఉత్పత్తి ఆధారంగా విభజించాలని ప్రతిపాదించారు. నియోజకవర్గాల పెంపు, మహిళా రిజర్వేషన్లు రెండు వేర్వేరు అంశాలని, వీటిని కలిపి నిర్ణయించడం సరైంది కాదన్నారు. ఈ అంశంపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, నిపుణుల కమిటీ నివేదిక ఆధారంగా నిర్ణయం తీసుకోవాలని సూచించారు. కేంద్రం తీసుకుంటున్న త్వరిత నిర్ణయాలు దేశంలో రాజకీయ అసమానతలు పెంచే ప్రమాదం ఉందని పేర్కొన్నారు.

ఆదివాసీ, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు: సీఎం హామీ :
సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రతినిధి: ఆదివాసీ, గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల సమగ్రాభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మంత్రి ధనసరి అనసూయ సీతక్క నేతృత్వంలోని గిరిజన ఎమ్మెల్యేల బృందం జూబ్లీహిల్స్ నివాసంలో సీఎంను కలిసి వినతిపత్రం అందజేయగా, చెక్ డ్యాంల నిర్మాణం ద్వారా తాగునీరు, సాగునీటి సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. రహదారులు, చెక్ డ్యాంల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతుల్లో ఎలాంటి అడ్డంకులు రాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజన రైతులకు బోర్లు త్రవ్వేందుకు అనుమతుల విషయంపై సానుకూలంగా స్పందించి, ఇందిరమ్మ ఇళ్ల కోటా పెంపును పరిశీలిస్తామని చెప్పారు. ఐటీడీఏలను బలోపేతం చేసి గిరిజనులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని పేర్కొన్నారు. సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్, రాజ్యసభ సభ్యుడు వేం నరేందర్ రెడ్డి పాల్గొన్నారు.



## భూభారతి చట్టానికి ఏడాది – భూ పరిపాలనలో పారదర్శక సంస్కరణలకు నాంది

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రతినిధి: రాష్ట్రంలో భూ పరిపాలనకు కొత్త దిశానిర్దేశం చేసిన భూభారతి చట్టం అమలులోకి వచ్చి ఏడాది పూర్తయిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం సచివాలయంలోని తన కార్యాలయంలో అధికారులతో భూభారతి చట్టంపై సమీక్ష నిర్వహించిన ఆయన మాట్లాడుతూ, ఇది కేవలం ఒక చట్టానికి ఏడాది పూర్తైన సందర్భం మాత్రమే కాకుండా, తెలంగాణలో భూహక్కుల రక్షణకు నాంది పలికిన కొత్త శకానికి ప్రారంభమని పేర్కొన్నారు. భూభారతి చట్టం ద్వారా భూ పరిపాలనను పారదర్శకంగా, ప్రజలకు సులభంగా అందుబాటులోకి తీసుకువచ్చామని చెప్పారు. గత ఏడాదిలో భూభారతి పోర్టల్‌కు 5 కోట్లకు పైగా సందర్శనలు నమోదవగా, సుమారు 70 లక్షల మంది లాగిన్ అయి సేవలను వినియోగించుకున్నారని వివరించారు. అలాగే 3.80 లక్షల మందికి పాస్‌బుక్‌లు జారీ చేయడం జరిగిందని తెలిపారు. పాత సర్వే విధానాలకు స్వస్తి పలికి ఆధునిక రోవర్ టెక్నాలజీతో సర్వేలు నిర్వహిస్తూ ప్రతి సర్వే నంబర్‌కు భూధార్ కేటాయింపు చేపట్టినట్లు వెల్లడించారు. భూహక్కుల పరిరక్షణ, అవినీతి రహిత సేవలు, వేగవంతమైన పరిపాలన లక్ష్యంగా ఈ చట్టాన్ని అమలు చేస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వ కాలంలో సరైన విధివిధానాలు లేకుండా తీసుకొచ్చిన 2020 ఆర్వోఆర్ చట్టం, ధరణి పోర్టల్ కారణంగా ప్రజలు ఎదుర్కొన్న సమస్యలను అధిగమిస్తూ ప్రస్తుతం రెవెన్యూ వ్యవస్థను పునర్నిర్మిస్తున్నామని స్పష్టం చేశారు. పారదర్శకత, బాధ్యతాయుతత, వేగం అనే మూడు ప్రధాన సూత్రాలతో భూభారతి చట్టాన్ని అమలు చేస్తున్నామని, ఇది తెలంగాణ చరిత్రలో ఒక కీలక సంస్కరణగా నిలిచిందని తెలిపారు.

## అరైవ్-అలైవ్ కార్యక్రమంతో రోడ్డు భద్రతపై దృష్టి – మంత్రి పొన్నం ప్రభాకర్




సందేశం టైమ్స్, ఖైరతాబాద్, ఏప్రిల్ 14, ప్రతినిధి: ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా రోడ్డు భద్రతపై అవగాహన పెంపు లక్ష్యంగా "అరైవ్-అలైవ్" కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఖైరతాబాద్ రవాణా శాఖ కార్యాలయంలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, రవాణా శాఖ కమిషనర్ ఇలాంబర్తి, ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డి, జేటీసీలు చంద్రశేఖర్ గౌడ్, రమేష్, శివలింగయ్య తదితర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ నెల 13 నుంచి 18 వరకు పోలీస్, రవాణా శాఖలు సంయుక్తంగా రోడ్డు భద్రతపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించడం, ప్రమాదాలకు కారణాలను గుర్తించి తగ్గించే చర్యలు చేపట్టడమే ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. పర్యావరణ పరిరక్షణతో పాటు ట్రాఫిక్ నిబంధనలను కఠినంగా అమలు చేయనున్నట్లు తెలిపారు. ఆరు రోజుల పాటు అన్ని జిల్లాల్లో సమీక్షలు నిర్వహించి రోడ్డు భద్రత చర్యలను బలోపేతం చేస్తామని చెప్పారు. ప్రమాదం జరిగిన గంటలోపు బాధితులను ఆస్పత్రికి చేర్చితే రహవీర్ అవార్డు అందిస్తామని వివరించారు. చెక్‌పోస్టులను ఎత్తివేసి సంస్కరణలు చేపట్టామని, అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు రవాణా నిబంధనలపై అవగాహన కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఆర్టీసీలో 30 ఏళ్ల సేవలో ఒక్క ప్రమాదం కూడా చేయని డ్రైవర్లను సన్మానించేందుకు నిర్ణయం తీసుకున్నామని పేర్కొన్నారు. ప్రతి జిల్లాలో రోడ్డు భద్రత సమావేశాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఇదే సమయంలో ఆర్టీసీ సమ్మెపై స్పందిస్తూ, ఆర్టీసీ ప్రభుత్వంలో విలీనం అంశం కమిటీ వద్ద ఉందని, రెండు సమస్యలను మినహాయించి మిగతా అంశాలపై చర్చకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సిబ్బందికి సంబంధించిన సమస్యలను పరిష్కరిస్తామని, ప్రేరేపిత సమ్మెలకు దూరంగా ఉండాలని సూచించారు. పెండింగ్ డీఏ ఇచ్చామని, పీఆర్సీపై ఆలోచన జరుగుతోందని మంత్రి వెల్లడించారు.

## డాక్టర్ బీఆర్ అంబేద్కర్ జయంతి – సీఎం రేవంత్ రెడ్డి ఘన నివాళులు

సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రతినిధి: భారత రాజ్యాంగ రూపశిల్పి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ గారి జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి ఆయనకు ఘన నివాళులు అర్పించారు. అణగారిన వర్గాల సంక్షేమం కోసం అంబేద్కర్ గారు చేసిన కృషిని కొనియాడుతూ, దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాలు, మహిళల సాధికారతకు ఆయన నిరంతరం పోరాడారని గుర్తు చేశారు. దేశ భవిష్యత్తును ముందుగానే ఊహించి దార్శనికతతో రాజ్యాంగాన్ని రూపొందించిన మహనీయుడిగా ఆయన భావితరాలకు స్ఫూర్తిగా నిలిచారని తెలిపారు. అణగారిన వర్గాల హక్కుల కోసం అంబేద్కర్ గారు చేసిన పోరాటం ప్రపంచానికి ఆదర్శమని పేర్కొంటూ, ఆయన ఆశయాల సాధనకు అందరూ కృషి చేయాలని సీఎం పిలుపునిచ్చారు. బాబాసాహెబ్ ఆలోచనలతో ప్రేరణ పొందిన ప్రజా ప్రభుత్వం ఎస్సీ ఉపకులాల వర్గీకరణ, బీసీ రిజర్వేషన్ల పెంపు వంటి కీలక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ అమలుతో పాటు దళిత, గిరిజన సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లలో మెస్ ఛార్జీలు, కాస్మొటిక్ ఛార్జీలు పెంచినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ నిర్మాణం చేపడుతూ, అన్ని వర్గాల పిల్లలకు నాణ్యమైన విద్య అందేలా చర్యలు తీసుకుంటున్నామని సీఎం వెల్లడించారు.

## ఆదివాసీ, గిరిజనుల సమగ్ర అభివృద్ధికి కట్టుబడి ఉన్నాం: సీఎం రేవంత్ రెడ్డి



సందేశం టైమ్స్, హైదరాబాద్, ఏప్రిల్ 14, ప్రతినిధి: ఆదివాసీ, గిరిజన, ఏజెన్సీ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. మౌలిక వసతుల కల్పనకు అడ్డంకిగా ఉన్న సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారిస్తామని తెలిపారు. మంత్రి సీతక్క నేతృత్వంలో గిరిజన, ఆదివాసీ ఎమ్మెల్యేల బృందం జూబ్లీహిల్స్ నివాసంలో ముఖ్యమంత్రిని కలిసి ఏజెన్సీ ప్రాంతాల సమస్యలపై వినతిపత్రం అందజేసింది. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ, ఆదివాసీలు, గిరిజనుల సంక్షేమం కోసం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

ఏజెన్సీ ప్రాంతాల్లో చెక్ డ్యాంల నిర్మాణంపై దృష్టి సారిస్తామని, వాటి ద్వారా తాగునీరు, సాగునీటి అవసరాలు తీర్చవచ్చని పేర్కొన్నారు. చెక్ డ్యాంలు, రహదారుల నిర్మాణానికి అటవీ శాఖ నుంచి ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటామని, అనుమతులు త్వరితగతిన వచ్చేలా చూస్తామని హామీ ఇచ్చారు. గిరిజన రైతులు సాగు చేస్తున్న భూముల్లో బోర్లు వేయడానికి అనుమతుల విషయంలో సానుకూలంగా స్పందించారు. అటవీ శాఖ అభ్యంతరాల వల్ల రహదారుల మరమ్మత్తులు ఆలస్యం అవుతున్నాయని, కొత్త రహదారులకు అనుమతులు రావడంలో ఇబ్బందులు ఉన్నాయని ఎమ్మెల్యేలు వివరించగా, వీటిపై వెంటనే చర్యలు తీసుకోవాలని అధికారులను సీఎం ఆదేశించారు. ఆదివాసీ, గిరిజన ప్రాంతాల్లో ఇందిరమ్మ ఇళ్ల కోటా పెంపును పరిశీలిస్తామని హామీ ఇచ్చారు. ఐటీడీఏలను మరింత బలోపేతం చేసి గిరిజనులకు అన్ని విధాలుగా అండగా ఉంటామని సీఎం తెలిపారు. సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ మురళి నాయక్ పాల్గొన్నారు.



# గ్రామాల్లో రోడ్డు భద్రత కమిటీల ఏర్పాటు ప్రమాదాల నివారణకు చైతన్యం

సందేశం టైమ్స్, అనంతగిరి, ఏప్రిల్ 14, ప్రతినిధి: ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా అనంతగిరి పోలీస్ స్టేషన్ పరిధిలోని గ్రామాల్లో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పోలీస్, రెవెన్యూ, ఆర్ అండ్ బి, గ్రామ పరిపాలన అధికారుల సమన్వయంతో "అరైవ్–అలైవ్" కార్యక్రమం కింద గ్రామ సభలు నిర్వహించి, గ్రామీణ రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేశారు. గ్రామ ప్రజాప్రతినిధులు, పెద్దలు, మహిళలు, పదవీ విరమణ పొందిన ఉద్యోగులు పాల్గొని కమిటీలలో సభ్యులయ్యారు. ఈ కమిటీల ద్వారా రోడ్డు భద్రతా నియమాలు, వాహనదారులు పాటించాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. గ్రామాల్లో ప్రమాదకర ప్రాంతాలను గుర్తించి, లోపాలను సరిదిద్దేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాల్సిన అవసరాన్ని అధికారులు వివరించారు. హెల్మెట్ ధరించడం, సీట్ బెల్ట్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపకూడదని గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. రోడ్డు భద్రతపై పోస్టర్లు, పాంప్లెట్లు పంపిణీ చేశారు. గ్రామాలను ప్రమాద రహితంగా మార్చేందుకు కమిటీలు బాధ్యతగా పనిచేయాలని సూచించారు. ప్రతి ఒక్కరు డిఫెన్సివ్ డ్రైవింగ్ పాటించడం ద్వారా ప్రమాదాలను తగ్గించవచ్చని, వాహన పత్రాలు సక్రమంగా ఉండాలని, ప్రయాణ సమయంలో ముందు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు సూచించారు. ప్రతి ప్రయాణం సురక్షితంగా గమ్యం చేరడమే పోలీస్ శాఖ లక్ష్యమని అధికారులు తెలిపారు.



# ప్రజావాణి దరఖాస్తులకు తొలి ప్రాధాన్యత: కలెక్టర్ ప్రావీణ్య

సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 14, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా ప్రజావాణి కార్యక్రమంలో స్వీకరించిన వినతులను అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య అధికారులకు ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలను స్వీకరించి మొత్తం 63 వినతులను సంబంధిత శాఖలకు పంపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు నమ్మకంతో ప్రభుత్వ దృష్టికి తీసుకొస్తున్న ఈ వినతుల పరిష్కారంలో ఎలాంటి ఆలస్యం జరగకూడదని స్పష్టం చేశారు. సంక్షేమం, రెవెన్యూ, వ్యవసాయం, గృహనిర్మాణం, మార్కెటింగ్, ఉపాధి తదితర శాఖలకు సంబంధించిన దరఖాస్తులను అధికారులు సమగ్రంగా పరిశీలించి వెంటనే చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రజావాణి దరఖాస్తులపై నిర్లక్ష్యం చూపకుండా బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పాండు, నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతి, వివిధ శాఖల జిల్లా అధికారులు, ఆర్డీవోలు, సిబ్బంది పాల్గొన్నారు.




# గ్రామాల్లో రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేయాలి: ఎస్సై దుర్గారెడ్డి

సందేశం టైమ్స్, కంగ్టి మండలం, ఏప్రిల్ 14, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలోని కంగ్టి మండల పరిధి గ్రామాల్లో రోడ్డు భద్రత కమిటీలను ఏర్పాటు చేసుకోవాలని ఎస్సై దుర్గారెడ్డి సూచించారు. సోమవారం చాప్టకే గ్రామంలో గ్రామస్తులతో సమావేశమై "అరైవ్–అలైవ్" కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, సురక్షిత ప్రయాణం కోసం జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణలో గ్రామస్థుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. అనంతరం గ్రామ ప్రజలతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ శివాజీ రావు, ఉపసర్పంచ్ మోహన్, మాజీ సర్పంచ్ సవిత బసప్ప, బిరాదర్ మాణిక్, సంగప్ప నరసింహులు తదితరులు పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశంలో సర్పంచ్ అల్లూరి సంతోష అంజనేయులు పాల్గొన్నారు

సందేశం టైమ్స్, వట్పల్లి మండలం, ఏప్రిల్ 14, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం సాయిపేట గ్రామంలో నిర్వహించిన ఇందిరమ్మ ఇళ్ల గృహప్రవేశ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అల్లూరి సంతోష అంజనేయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కొర్పోలు విష్ణు యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేదల సొంతింటి కల సాకారం అవుతోందని, ప్రతి అర్హ కుటుంబానికి గృహం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# చౌటకూరులో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల పంపిణీ



సందేశం టైమ్స్, చౌటకూరు మండలం, ఏప్రిల్ 14, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా అందోల్ నియోజకవర్గ పరిధిలోని చౌటకూరు మండలంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఆదేశాల మేరకు చౌటకూరు గ్రామంలో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సుభాష్ రెడ్డి, గ్రామ సర్పంచ్ పార్కల రామ్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఆపదలో ఉన్న ప్రజలకు ఆర్థిక సహాయం అందిస్తూ అండగా నిలుస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు రామ గౌడ్, గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వర్కాల రమేష్, వార్డు సభ్యులు చక్రపాణి, కొజ్జ లక్ష్మయ్య, నాయకులు కొల్లూరి మొగులయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రమాదాల నివారణకు కలిసికట్టుగా కృషి చేద్దాం: కలెక్టర్ ప్రావీణ్య



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 14, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించి కలిసికట్టుగా కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పిలుపునిచ్చారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం కలెక్టర్ చాంబర్లో 'రహ్-వీర్' మరియు ట్రాఫిక్ నిబంధనలకు సంబంధించిన అవగాహన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ట్రాఫిక్ నియమాలను కచ్చితంగా పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని, ప్రమాదాల సమయంలో క్షతగాత్రులకు తక్షణ సహాయం అందించడం ద్వారా విలువైన ప్రాణాలను కాపాడవచ్చని తెలిపారు. ప్రమాద బాధితులకు సహాయం చేసిన వారికి ప్రభుత్వం 'రహ్-వీర్' పథకం కింద రూ.25,000 వరకు ప్రోత్సాహకాన్ని అందిస్తుందని, సహాయం చేస్తే ఇబ్బందులు వస్తాయనే అపోహలను ప్రజలు విడనాడాలని సూచించారు. జిల్లాలో 'అరైవ్–అలైవ్' కార్యక్రమం ద్వారా విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రవాణాధికారి అరుణతో పాటు రవాణా శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.





# ఇంటర్ ఫలితాల్లో పోతులబోడ మాడల్ కాలేజీ విద్యార్థుల ప్రతిభ

సందేశం టైమ్స్, వట్పల్లి మండలం, ఏప్రిల్ 14, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పోతులబోడ మాడల్ జూనియర్ కాలేజీ (టీ జీ ఎంఎస్) విద్యార్థులు ఇంటర్మీడియట్ ఫలితాల్లో విశేష ప్రతిభ కనబర్చారు. సెకండియర్‌లో ఎంపీసీ విభాగంలో ఎ. రేణుక 696 మార్కులు సాధించగా, బైపీసీలో జి. సాయి కృష్ణ 683 మార్కులు, ఎంపీసీలో స.క. సబియా 666 మార్కులతో కాలేజీ టాపర్లుగా నిలిచారు. ఫస్ట్ ఇయర్‌లో బైపీసీ విభాగంలో సిహెచ్. భానుప్రియ 404 మార్కులతో మొదటి స్థానం సాధించగా, ఎంపీసీలో ఎం. నందిని, ఎం. అశ్విని తలో 386 మార్కులతో రెండో స్థానం దక్కించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం వల్లే ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఎం. దినా మేడం అభినందించారు.

# రోడ్డు ప్రమాదాల నియంత్రణ అందరి బాధ్యత: కలెక్టర్ ప్రావీణ్య – అన్ని శాఖల సమన్వయంతో నివారణ చర్యలు: ఎస్పీ పరతోష్ పంకజ్



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 14, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణ ప్రతి ఒక్కరి బాధ్యత అని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య పేర్కొన్నారు. ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా సోమవారం సంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని వార్డుల్లో పోలీస్, మున్సిపల్ శాఖల ఆధ్వర్యంలో నిర్వహించిన "అరైవ్–అలైవ్" అవగాహన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ హైవేలపై అధిక వేగం వల్ల ప్రమాదాలు పెరుగుతున్నాయని, ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, కారులో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. వాహనం నడుపుతూ మొబైల్ వినియోగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం మానుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని హెచ్చరించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు "అరైవ్–అలైవ్" కార్యక్రమాన్ని అమలు చేస్తున్నదని తెలిపారు. జిల్లా ఎస్పీ పరతోష్ పంకజ్ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని శాఖల సమన్వయంతో చర్యలు తీసుకుంటున్నామని, ముఖ్యంగా హైవేలపై ప్రమాదాలు అధికంగా జరుగుతున్నాయని చెప్పారు. ప్రతి సంవత్సరం 400 మందికి పైగా ప్రాణాలు కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేస్తూ, ఒకే బైక్‌పై ముగ్గురు, నలుగురు ప్రయాణించడం ప్రమాదకరమని, మైనర్ల డ్రైవింగ్‌పై ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నామని తెలిపారు. అడిషనల్ కలెక్టర్ పాండు మాట్లాడుతూ మైనర్లకు వాహనాల తాళాలు ఇవ్వకుండా పెద్దలు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలతో రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించి, హెల్మెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్పర్సన్ వనిత సంతోష్, సబ్ కలెక్టర్ ఉమా హారతి, వార్డు కౌన్సిలర్లు, పోలీస్ అధికారులు, ప్రజలు, యువత తదితరులు పాల్గొన్నారు.



## పార్థివ దేహానికి పూలమాల అర్పించిన జయమ్మ మాతాజీ

సందేశం టైమ్స్, పటాన్‌చెరువు, ఏప్రిల్ 14, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువు నియోజకవర్గం రామచంద్రపూర్ మాజీ ఎంపీపీ యాదగిరి యాదవ్ తండ్రి మరణంతో నిర్వహించిన అంత్యక్రియలకు పలువురు ప్రముఖులు హాజరై నివాళులర్పించారు. ఈ సందర్భంగా శ్రీశ్రీశ్రీ నాగదేవత ఉపాసకురాలు జయమ్మ మాతాజీ పాల్గొని పార్థివ దేహానికి పూలమాల అర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఎంపీలు, కౌన్సిలర్లు, అలాగే మాజీ ప్రజాప్రతినిధులు కూడా హాజరై యాదగిరి యాదవ్ కుటుంబానికి సానుభూతి తెలిపారు. ఈ దుఃఖ సమయంలో కుటుంబానికి అండగా నిలుస్తూ ధైర్యం చెప్పారు.



## వానాకాలానికి ముందే సింగూర్ డ్యాం పనులు పూర్తి చేయాలి: మంత్రి దామోదర్ రాజనర్సింహ


సందేశం టైమ్స్, పుల్కల్ మండలం, ఏప్రిల్ 14, ప్రతినిధి: వానాకాలం ప్రారంభమయ్యేలోపు సింగూర్ డ్యాం మరమ్మత్తు పనులు పూర్తిచేసి నీటి నిల్వకు ఎలాంటి ఆటంకం లేకుండా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర వైద్య, ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఇరిగేషన్ ఇంజనీర్లు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. సోమవారం పుల్కల్ మండలంలో సింగూర్ డ్యాం మరమ్మత్తులు, కాలువల లైనింగ్ పనులను మంత్రి పరిశీలించారు. పనుల్లో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడకూడదని స్పష్టం చేశారు. అలాగే బస్వాపూర్ కాలువ పనులను కూడా పరిశీలించి నీటి పారుదల నిరంతరంగా కొనసాగేందుకు వేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. సింగూర్ రిజర్వాయర్ ప్రాంతంలో టూరిజం అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ మధ్యలో ఐలాండ్, టూరిజం పార్క్ ఏర్పాటుకు ఎస్టిమేట్లు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. అనంతరం బస్వాపూర్‌లో రూ.200 కోట్ల వ్యయంతో 31 ఎకరాల్లో నిర్మిస్తున్న యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాల పనులను సమీక్షించి వచ్చే విద్యాసంవత్సరానికి ముందే పూర్తి చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ పాండు, చీఫ్ ఇంజనీర్ రాజమ్మతో పాటు పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



## దరఖాస్తుపల్లి గ్రామపంచాయతీలో రోడ్డు భద్రత అవగాహన సదస్సు

సందేశం టైమ్స్, వట్పల్లి మండలం, ఏప్రిల్ 14, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలం పరిధిలోని దరఖాస్తుపల్లి గ్రామపంచాయతీలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సును సర్పంచ్ కలాలి సురేఖ, సత్యనారాయణ గౌడ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, వాహనం నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు తప్పనిసరిగా పాటించాలని సూచించారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగం ప్రాణాలను రక్షిస్తాయని, మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని, మొబైల్ ఫోన్ ఉపయోగించకుండా జాగ్రత్తగా వాహనం నడపాలని తెలిపారు. పాదచారులు జీబ్రా క్రాసింగ్ వద్దనే రోడ్డు దాటాలని, విద్యార్థులు చిన్న వయసులో వాహనాలు నడపకూడదని అవగాహన కల్పించారు. వాహనాలు సక్రమ స్థితిలో ఉంచుకోవడం, వర్షం, పొగమంచు సమయంలో జాగ్రత్తగా డ్రైవింగ్ చేయడం, ప్రమాదం జరిగినప్పుడు వెంటనే సహాయం అందించడం అవసరమని పేర్కొన్నారు. "జాగ్రత్తగా నడిపితేనే సురక్షితంగా చేరుకుంటాం" అనే నినాదంతో నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## సెన్సస్-2027 పనులు గడువులోపు పూర్తి చేయాలి: రాష్ట్ర సంచాలకులు భారతి హోళికేరి





సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 14, ప్రతినిధి: జనగణన-2027లో భాగంగా చేపట్టనున్న ఇండ్ల గణన (హౌస్ లిస్టింగ్) ప్రక్రియను పూర్తిగా పారదర్శకంగా, పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని తెలంగాణ రాష్ట్ర జనగణన సంచాలకులు భారతి హోళికేరి సూచించారు. సోమవారం హైదరాబాద్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన సమీక్షలో ఆమె మాట్లాడుతూ ఎన్యూమరేటర్ల మాన్యువల్స్, సూపర్వైజర్ కిట్స్, మ్యాప్స్ వంటి సామగ్రి సరఫరా సమయానికి పూర్తి చేయాలని ఆదేశించారు. ఇండ్ల జాబితా బ్లాకుల రూపకల్పన ఖచ్చితంగా చేయడంతో పాటు ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్ల నియామకం పూర్తి చేసి మండల స్థాయిలో శిక్షణ కార్యక్రమాలు సమయానికి నిర్వహించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణతో సెన్సస్ ప్రక్రియను సాఫీగా అమలు చేయాలని, నిర్ణీత గడువులోపు అన్ని పనులు పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ జిల్లాలో ఇండ్ల గణనను నిబంధనల మేరకు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా స్థాయి అధికారులు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సాయిపేట్‌లో 'అరైవ్ అండ్ అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం



సందేశం టైమ్స్, వట్పల్లి మండలం, ఏప్రిల్ 14, ప్రతినిధి: సంగారెడ్డి జిల్లా వట్పల్లి మండలంలోని సాయిపేట్ గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు 'అరైవ్ అండ్ అలైవ్' కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. వట్పల్లి పోలీస్ స్టేషన్ ఎస్ఐ లవకుమార్ ఆదేశాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అల్లూరి సంతోష అంజనేయులు, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు కొర్పోలు విష్ణు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ ప్రజలకు ట్రాఫిక్ నియమాల ప్రాముఖ్యత, హెల్మెట్ వినియోగం, మద్యం సేవించి డ్రైవింగ్ చేయడం వల్ల కలిగే ప్రమాదాలపై అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు పాటించి సురక్షిత ప్రయాణం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



## జగన్నాథపురం గ్రామంలో 'అరైవ్-అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమం

సందేశం టైమ్స్, చింతకాని, ఏప్రిల్ 14, ప్రతినిధి: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న ప్రజా పాలన-ప్రగతి ప్రణాళికలో భాగంగా చింతకాని సబ్ ఇన్‌స్పెక్టర్ వీరేందర్ ఆధ్వర్యంలో జగన్నాధపురం గ్రామంలో 'అరైవ్-అలైవ్' రోడ్డు భద్రత అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలకు రోడ్డు భద్రత నియమాలు, ట్రాఫిక్ రూల్స్ పాటించడం ద్వారా ప్రమాదాలను ఎలా నివారించవచ్చో వివరించారు. వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగించాలని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ తాళ్లూరి స్వప్న, ఉప సర్పంచ్ అలవాల శ్రీదేవి, వార్డు సభ్యులు తోటకూరి హరీష్, కాంగ్రెస్ నాయకులు తాళ్లూరి రమేష్, తన్నీరు పుల్లారావు, ముల్లంగి కోటయ్య, గుడిపూడి నరసింహారావు, అలవాల నాగేశ్వరరావు, యర్రమల ప్రసాద్, ఎస్.కె సైదా, అంగన్వాడీ టీచర్ కాసిమాల వెంకమ్మ, ఆశా వర్కర్ బందెల అరుణ, ఎరుకల వెంకటేష్, కాశీమాల శ్రీను, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఏప్రిల్ 14న అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు అందరికీ ఆహ్వానం: కలెక్టర్ ప్రావీణ్య



సందేశం టైమ్స్, సంగారెడ్డి, ఏప్రిల్ 14, ప్రతినిధి: భారత రాజ్యాంగ శిల్పి డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ 135వ జయంతి సందర్భంగా ఈ నెల 14న ఉదయం 9 గంటలకు పాత బస్టాండ్ వద్ద ఉన్న ఆయన విగ్రహానికి పుష్పమాలంకరణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య తెలిపారు. అనంతరం షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో బహిరంగ సభ ఏర్పాటు చేయనున్నట్లు ఆమె వెల్లడించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, అధికారులు, వివిధ కుల సంఘాల నాయకులు, బడుగు బలహీన వర్గాల ప్రతినిధులు, ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.




## శ్రీ ఆదర్శలో పదో తరగతి విద్యార్థులకు ఘన వీడ్కోలు

సందేశం టైమ్స్, చింతకాని, ఏప్రిల్ 14, ప్రతినిధి: చింతకాని మండలం నాగులవంచలోని శ్రీ ఆదర్శ విద్యాలయంలో పదో తరగతి విద్యార్థుల వీడ్కోలు సమావేశం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ బోడేపూడి కిరణ్ మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను ఏర్పరుచుకొని సానుకూల దృక్పథంతో ముందుకు సాగాలని సూచించారు. క్రమశిక్షణ, అకుంఠిత దీక్షతో కష్టపడితే అనుకున్న గమ్యాన్ని చేరవచ్చుని ఆయన తెలిపారు. పాఠశాలతో ఉన్న అనుబంధాన్ని విద్యార్థులు గుర్తు చేసుకుంటూ భావోద్వేగంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చావా అరుణ్ కుమార్, ఉపాధ్యాయులు బోల్ల రేణుక, జొన్నలగడ్డ శ్రీనివాసరావు, పందిరి పుల్లారావు, సుధాకర్, ప్రశాంతి, పార్వతి, సుజాత, త్రివేణి తదితరులు పాల్గొన్నారు.



## పోసానిపేటలో రోడ్ సేఫ్టీ గ్రామ సభ ప్రజల్లో అవగాహన పెంపు

సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, అందోల్ మండలం, ఏప్రిల్ 14, ప్రతినిధి: ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా పోసానిపేట గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన కల్పించేందుకు గ్రామ సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జి. గోపాల్, ఉపసర్పంచ్ జి. రాములు,గ్రామపంచాయతీ వార్డు సభ్యులు వి. వెంకటేశం, ఎం. అశోక్, ఎం. ప్రభాకర్, బి. మధు, జి. మాణిక్యమ్మ, గ్రామ పెద్దలు పి. లక్షయ్య, వడ్ల శ్రీనివాస్, ఎం.డి. ఆఫ్సర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఎం. నగేష్, ఆశా వర్కర్ జి. రాణి, అంగన్వాడీ టీచర్ తదితరులు పాల్గొన్నారు. అలాగే గ్రామ యువకులు మరియు అధిక సంఖ్యలో గ్రామ ప్రజలు హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ జి. గోపాల్ మాట్లాడుతూ రోడ్లపై ప్రయాణించే ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తప్పకుండా పాటించాలని సూచించారు. ఉపసర్పంచ్ జి. రాములు మాట్లాడుతూ గ్రామంలో రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించేందుకు మరిన్ని ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని తెలిపారు. వార్డు సభ్యుడు వి. వెంకటేశం మాట్లాడుతూ హెల్మెట్ వినియోగం, రోడ్డు నియమాల పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని వివరించారు.గ్రామ సభలో పాల్గొన్న ప్రజలు రోడ్డు భద్రతపై తమ అభిప్రాయాలను వ్యక్తం చేసి సూచనలు చేశారు. అధికారులు వాటిని పరిగణలోకి తీసుకుని చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం ద్వారా గ్రామ ప్రజల్లో రోడ్ సేఫ్టీపై అవగాహన పెరిగిందని నిర్వాహకులు తెలిపారు.

## డా. బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేసిన బీజేపీ నాయకులు



సందేశం టైమ్స్, సంగారెడ్డి జిల్లా, అందోల్ మండలం, ఏప్రిల్ 14, ప్రతినిధి: జోగిపేట పట్టణంలో డా. బి.ఆర్. అంబేద్కర్ జయంతి సందర్భంగా బీజేపీ నాయకులు ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా విగ్రహాన్ని శుభ్రమైన మంచినీటితో కడిగి అనంతరం పాలాభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల టౌన్ అధ్యక్షురాలు పావని, కో కన్వీనర్ సుమన్, పోసానిపేట గ్రామ వార్డుమెంబర్ వి. వెంకటేశం, జోగిపేట టౌన్ ప్రధాన కార్యదర్శి పాపయ్య, భూమయ్య, యాదగిరి, జగణతం, అఖిల్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా బీజేపీ అధ్యక్షురాలు పావని మాట్లాడుతూ డా. అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. సమాజంలో సమానత్వం, న్యాయం కోసం ఆయన చేసిన కృషిని ప్రతి ఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని అంబేద్కర్ గారికి నివాళులు అర్పించారు.

## షెర్కాన్‌పల్లి పలుగు పోచమ్మ అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి పూజలు చేసిన ఈర్ల రాజు ముదిరాజ్




సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 14, ప్రతినిధి: నర్సాపూర్ నియోజకవర్గం హత్నూర మండలం షెర్కాన్‌పల్లి గ్రామ పరిధిలోని పలుగు పోచమ్మ అమ్మవారిని అమీన్‌పూర్ బీజేపీ మండల అధ్యక్షులు ఈర్ల రాజు ముదిరాజ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ఓడి బియ్యం సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కుటుంబ సభ్యులు పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం పొందారు.



## నో హెల్మెట్ – నో ఎంట్రీ నందగోకుల్: రోడ్డు భద్రతకు వినూత్న కార్యక్రమం

సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 14, ప్రతినిధి: ప్రజా పాలన–ప్రగతి ప్రణాళికలో భాగంగా మెదక్ జిల్లాలోని 492 గ్రామపంచాయతీల్లో గ్రామ సభల ద్వారా “అరైవ్–అలైవ్” రోడ్డు భద్రత కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. నిజాంపేట మండలం నందగోకుల్ గ్రామంలో నిర్వహించిన గ్రామసభలో పాలక వర్గం ఏకగ్రీవ తీర్మానం మేరకు “నో హెల్మెట్ – నో ఎంట్రీ నందగోకుల్” అనే వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు.ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్, ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామస్తులు వారికి పూలతో ఘన స్వాగతం పలికారు. అనంతరం హెల్మెట్లు ధరించి ద్విచక్ర వాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గ్రామ ప్రజల ప్రాణ రక్షణ దృష్ట్యా నందగోకుల్ గ్రామస్తులు తీసుకున్న నిర్ణయం ఆదర్శమని, ప్రతి గ్రామం ఈ విధానాన్ని అనుసరించాలని సూచించారు. ఇంటి నుంచి బయటకు వెళ్లిన వ్యక్తి సురక్షితంగా తిరిగి రావాలంటే ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని పేర్కొన్నారు. హెల్మెట్, సీట్‌బెల్ట్ తప్పనిసరిగా వినియోగించాలని, మద్యం సేవించి వాహనం నడపడం, అతివేగం, మొబైల్ ఫోన్ వినియోగం ప్రమాదాలకు ప్రధాన కారణాలని తెలిపారు.ఎస్పీ డి.వి. శ్రీనివాస్ రావు మాట్లాడుతూ దేశవ్యాప్తంగా రోడ్డు ప్రమాదాల్లో లక్షలాది మంది ప్రాణాలు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మెదక్ జిల్లాలోనూ ప్రతి సంవత్సరం వందల సంఖ్యలో మరణాలు నమోదవుతున్నాయని తెలిపారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం వల్లే ఎక్కువ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ నందగోకుల్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకొని హెల్మెట్ ధరించడం, నిబంధనలు పాటించడం అలవాటు చేసుకోవాలని కోరారు. అనంతరం రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. హెల్మెట్ వినియోగంపై కానిస్టేబుల్ చేసిన మిమిక్రీ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.ఈ కార్యక్రమంలో నిజాంపేట తహసీల్దార్ శ్రీనివాస్, మండల ప్రత్యేక అధికారి దేవకుమార్, సర్పంచ్ పాతూరు భాను, ఎంపీడీవో రాజిరెడ్డి, సీఐ వెంకటరాజా గౌడ్, డీఎస్పీ నరేందర్ గౌడ్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## జనగణన కోసం సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్ల నియామకం పూర్తి – కలెక్టర్ ప్రతిమా సింగ్






సందేశం టైమ్స్, మెదక్ నియోజకవర్గం, ఏప్రిల్ 14, ప్రతినిధి: మెదక్ జిల్లాలో జరగనున్న జనగణన కార్యక్రమానికి సంబంధించి సూపర్ వైజర్లు, ఎన్యూమరేటర్ల నియామక ప్రక్రియను పూర్తిచేసినట్లు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. సోమవారం హైదరాబాద్ నుండి కులగణన సంచాలకులు శ్రీమతి భారతి హోళికేరి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి పాల్గొన్నారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 26వ తేదీ నుండి మే 10వ తేదీ వరకు నిర్వహించనున్న సెల్ఫ్ ఎన్యూమరేషన్ ప్రక్రియపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రచార కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, ప్రముఖులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అవగాహన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.జిల్లాలో మొత్తం 1406 మంది ఎన్యూమరేటర్లు, 248 మంది సూపర్ వైజర్లను నియమించినట్లు ఆమె వెల్లడించారు. జనగణన ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో జనగణన సూపరింటెండెంట్ గఫార్, ఈడీయం సందీప్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## హోటళ్లలో అగ్ని భద్రత నియమాలు తప్పనిసరిగా పాటించాలి – అదనపు కలెక్టర్ కె. సీతారామరావు



సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 14, ప్రతినిధి: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా హోటల్ నిర్వాహకులు అగ్నిమాపక శాఖ నియమాలను తప్పనిసరిగా పాటిస్తూ ప్రమాదాలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ కె. సీతారామరావు సూచించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అగ్ని నివారణపై అవగాహన పోస్టర్లను ఆయన ఆవిష్కరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ హోటళ్లలో అగ్నిమాపక పరికరాలు ఎల్లప్పుడూ పని చేసేలా ఉంచాలని, ప్రతి అంతస్తులో ఎస్కేప్ ప్లాన్, మెట్ల మార్గాలు స్పష్టంగా ఉండేలా చూడాలని తెలిపారు. అగ్ని ప్రమాదాల నివారణకు ఎయిర్ కండిషనర్ డ్యాంపర్లు ఆటోమేటిక్ డిటెక్టివ్ సిస్టమ్‌తో అనుసంధానం చేయాలని సూచించారు. విద్యుత్ వైరింగ్, స్విచ్ బోర్డులు క్రమం తప్పకుండా తనిఖీ చేయాలని, లోపాలు ఉంటే వెంటనే సరిచేయాలని చెప్పారు.హోటల్ సిబ్బందికి అగ్నిమాపక పరికరాలపై శిక్షణ ఇవ్వాలని, తరచూ మాక్ డ్రిల్స్ నిర్వహించి అత్యవసర పరిస్థితుల్లో ఎలా స్పందించాలో అవగాహన కల్పించాలని పేర్కొన్నారు. వంటగదిలో ఎల్పీజీ సిలిండర్ల వినియోగంపై ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, బస చేసే అతిథులకు కూడా అత్యవసర బయటకు వెళ్లే మార్గాలపై అవగాహన కల్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో అగ్నిమాపక శాఖ అధికారి జానయ్య, ముఖ్య ప్రణాళిక అధికారి కిషన్, జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు, అడిషనల్ పీడీ సురేష్, డీఎంఓ నాగేశ్వర శర్మ, కలెక్టరేట్ ఏవో సుదర్శన్ రెడ్డి, జిల్లా స్పోర్ట్స్ అధికారి వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులకు సత్వర పరిష్కారం ఇవ్వాలి అదనపు కలెక్టర్ కె. సీతారామారావు



సందేశం టైమ్స్, సూర్యాపేట, ఏప్రిల్ 14, ప్రతినిధి: ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా వెంటనే పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ కె. సీతారామారావు ఆదేశించారు. సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ పెండింగ్ దరఖాస్తులకు అత్యధిక ప్రాధాన్యత ఇచ్చి తక్షణమే పరిష్కరించాలని సూచించారు.ఈరోజు నిర్వహించిన ప్రజావాణిలో మొత్తం 95 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. వీటిలో భూ సమస్యలకు సంబంధించినవి 40, మున్సిపాలిటీకి సంబంధించినవి 13, డీపీఓ 5, డీడబ్ల్యూ ఓ 2, మిగిలిన 35 ఇతర శాఖలకు సంబంధించినవిగా ఉన్నాయని వెల్లడించారు. అన్ని దరఖాస్తులను శాఖల వారీగా పంపించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో కలెక్టరేట్ ఏవో సుదర్శన్ రెడ్డి, డీఆర్డీఏ అదనపు పీడీ సురేష్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

పత్రిక పేరు : సందేశం టైమ్స్ (Sandesham Times) – రిజిస్ట్రేషన్ నం :TGTEL/25/A0348, టైటిల్ కోడ్: Sandhesham Times,(పబ్లికేషన్: అమృత వెంకట్ మీడియా పబ్లికేషన్ ప్రైవేట్ లిమిటెడ్.) ప్రచురణ స్థలం: 3-82, వాయిల సింగారం గ్రామం, అనంతగిరి మండలం, సూర్యాపేట జిల్లా, తెలంగాణ – 508206, ప్రచురణకర్త / publisher : కాసె అమృత, మొబైల్: 9052045435, ఈ-మెయిల్: sandeshamtimes@gmail.com, వెబ్‌సైట్: www.sandeshamtimes.com, ముద్రణ స్థలం: సండే ప్రింటింగ్ ప్రెస్ (Sunday Printing Press), 3-4297, సరస్వతి కాంప్లెక్స్, SVN కాలనీ, గుంటూరు, ఆంధ్రప్రదేశ్ – 522006.